క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.20 వేల విరాళం



ప్రత్యేక పూజలు చేస్తున్న దాతలు

బిక్కవోలు: లక్ష్మీగణపతి స్వామి ఆలయ నిత్యాన్నదానానికి దాత రూ.20 వేల విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఈవో రామలింగభాస్కర్ తెలిపారు. ఆదివారం విశ్రాంత డీఎల్‌పీఓ, కాకినాడ జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ఎర్రగుంట విజయ జగన్నాథరావు, గిరిజా దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విరాళం అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్ఞాపిక అందించారు.

షష్ఠి ఉత్సవాలకు రాట ముహూర్తం



బిక్కవోలులో రాట ముహూర్తం చేస్తున్న ప్రముఖులు

బిక్కవోలు: రాష్ట్ర వ్యాప్తంగా భక్తజనం తరలి వచ్చే శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి ఉత్సవాలకు రాట ముహూర్తాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లివాసు దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చే నెల 6న రాత్రి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆదిత్యుడికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆలయంలో వ్రతపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

చంద్రశేఖరస్వామికి లక్షపత్రి పూజ



సుగంధ ద్రవ్యాలతో చంద్రశేఖరుడికి అభిషేకం

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత శ్రీ చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి అనంతరం 11 రకాల ద్రవ్యాలతో చంద్రశేఖరస్వామికి అభిషేకాలు, పత్రిపూజ చేపట్టారు. కాత్యాయనీ అమ్మవారికి లలిత సహస్రనామాలతో కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో 14 మంది ఋత్వికులు ఈ పూజలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు హాజరయ్యారు.

నేడు పీజీఆర్ఎస్

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ప్రజా సమస్యల పరిష్కారార్థం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.



వంగలపూడి ఇసుక ర్యాంపులో వంటావార్పు చేపట్టిన ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలు

ఎక్కడి ఇసుక అక్కడే!

- వంగలపూడి రీచ్‌లో రెండో రోజూ నిలిచిన తవ్వకాలు
- ర్యాంపులో వంటా వార్పు చేపట్టిన కూలీలు
- స్టాక్ పాయింట్ వద్ద సరకు లేక నిలిచిన లారీలు

సీతానగరం: మండలంలోని వంగలపూడి రీచ్‌లో రెండో రోజు ఆదివారం ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. కూలీలు వంటావార్పు కార్యక్రమం చేపట్టి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లేక అధిక సంఖ్యలో లారీలు ర్యాంపులో నిలిచి ఉన్నాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వంగలపూడి ర్యాంపులో నాలుగు రోజులు ఇసుక తవ్వకాలు సజావుగా సాగాయి. గోదావరి పరివాహక ప్రాంతంలో కూలీలు ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లపై ఎగుమతి చేసి, అక్కడ నుంచి స్టాక్ పాయింట్ వద్ద ఇసుక డంప్ చేశారు. ట్రాక్టర్‌కు రూ.150, కూలీలకు రూ.200 ర్యాంపు నిర్వాహకులు చెల్లిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు ఇసుకను స్టాక్ పాయింట్ వద్దకు తరలించడానికి ఇచ్చే ధర గిట్టుబాటు అవ్వడం లేదని, ట్రాక్టర్ ఒక్కొంటికి రూ.250, కూలీలకు రూ.250 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. దీంతో ర్యాంపు నిర్వాహకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంతో కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు ఆదివారం ఉదయం నుంచి ర్యాంపు వద్దకు చేరకుని వంటావార్పు కార్యక్రమం చేపట్టి, మధ్యాహ్నం భోజనాలు ర్యాంపు వద్ద చేశారు. ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలు విలేకరులతో మాట్లాడుతూ ర్యాంపు నిర్వాహకులు



వంగలపూడి రీచ్‌లో స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లేకపోవడంతో నిలిచిన లారీలు

చెల్లించే ధర గిట్టుబాటు అవ్వడం లేదని, రేటు పెంచాలని కోరుతుంటే, ఇప్పటికే ర్యాంపులో రూ.25 లక్షలు ఇచ్చానని ర్యాంపు నిర్వాహకులు అంటున్నారని, అన్ని రూ.లక్షలు ఎవరికి ఇచ్చారనేది తెలపాలని డిమాండ్ చేశారు. అయితే స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలు అధిక సంఖ్యలో ర్యాంపులో నిలిపి ఉంచారు. కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లతో ర్యాంపు నిర్వాహకులు చర్చలు జరిపి, సమస్య పరిష్కరిస్తారని, అనంతరం ఇసుక తవ్వకాలు జరుపుతారని లారీ డ్రైవర్లు ఎదురుచూస్తున్నారు.

జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం

తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ వంగలపూడి రీచ్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీల సమస్యపై ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడాం. కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు తమకు అందించే ధర పెంచాలని అంటున్నారని, ర్యాంపు నిర్వాహకులు అందుకు ఒప్పుకోవడం లేదని చెప్పారు. ఈ విషయం జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టిలో ఉంచామన్నారు.

• వికసించిన కలువలు



శ్రీరంగపట్నంలోని పొలంలో వికసించిన కలువ పువ్వులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని పొలాల్లో కలువ పువ్వులు వికసించాయి. మహావిష్ణువుకు కలువ పువ్వులంటే ఎంతో ఇష్టమని ప్రతీతి. కార్తిక మాసం కావడంతో అనేక మంది ఇక్కడకు వచ్చి వీటిని తీసుకువెళుతున్నారు. దాదాపు 14 ఎకరాల విస్తీర్ణంలోని పొలాల్లో పువ్వులు కనువిందు చేస్తున్నాయి. నర్సాపురం కర్ణంగా పిలువబడే వారి పేరున ఉన్న ఐదు ఎకరాలు, దాడి శివాజీకి చెందిన రెండు ఎకరాలు, చెరువు గర్భంగా ఉన్న మరో ఏడు ఎకరాల్లో కలువ పువ్వులున్నాయి. ఈ ఏడాది బురద కాలువ వరద కారణంగా ఈ గ్రామంలోని పొలాలు ముంపునకు గురయ్యాయి. అనంతరం వరద తగ్గినా కొన్ని పొలాల్లో నీరు లాగలేదు. దీంతో వరినాట్లు వేయని ఆయా పొలాల్లో కలువలు కొలువుదీరాయి.

కోడి పందేలాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం వెలమపేట శివారున కోడిపందేలాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని ఏడు సెల్ ఫోన్లు, రెండు పందెం కోళ్లు, రూ.1,940 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.

మణికంఠుడికి ప్రత్యేక పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో ఆదివారం రాత్రి అయ్యప్పల పడిపూజ జరిగింది. అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములందరూ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి పీఠంలో తొలుత విఘ్నేశ్వరుడికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజ చేశారు. అనంతరం అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు. అంగపూజ, సహస్రనామాలు, అష్టోత్తర అర్చనలు నిర్వహించారు. గురుస్వామి రామకృష్ణ ఆధ్వర్యంలో 50 మంది స్వాములు పాల్గొన్నారు. దీంతో మణికంఠుడి నామస్మరణతో గ్రామం మారుమోగింది.

దూరవిద్య పీజీ కోర్సులకు అనుమతి

పెదపూడి: అనపర్తిలోని జీబీఆర్ డిగ్రీ కాలేజీలో దూరవిద్య పీజీ కోర్సులకు అనుమతి లభించినట్లు కళాశాల కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్బాయిరెడ్డిలు తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా దూర విద్యాకేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సైన్సు విభాగంలో ఎంఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, మైక్రోబయాలజీ, సైకాలజీ, బోటనీ, జువాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సెస్, స్టాటిస్టిక్స్ గ్రూపులు మంజూరైనట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు, ఉద్యోగులు, గృహిణులు, రెగ్యులర్‌గా కళాశాలకు వెళ్లలేని విద్యార్థులు వినియోగించుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

కొండను పిండి చేస్తున్నారు!

- కాటవరం కొండ వద్ద అనధికార తవ్వకాలు
- రాత్రి, పగలు యథేచ్ఛగా..
- తెలిపినా పట్టించుకోని అధికారులు



కాటవరం కొండను విచ్చలవిడిగా తవ్వి పొక్లెయిన్‌తో లారీలపై ఎగుమతి చేస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని కాటవరం కొండను కూటమి ప్రభుత్వం అండదండలతో గుల్ల చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కొండను పిండి చేస్తున్నారు. పొక్లెయిన్‌తో కొండను తవ్వి లారీలపై ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇసుక దోపిడీ, కొండలను తవ్వడం వంటి పలు కార్యక్రమాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల అండదండలతో కొండ వద్ద తవ్వకాలు జరుపుతున్నారు. కొండను తవ్విన గ్రావెల్‌ను కోరుకొండ మండలం వైపునకు తరలిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విచ్చలవిడిగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టిలో ఉంచినా ఒకరికి చెప్పాలని ఒకరు అంటున్నారే తప్ప కొండ వద్ద తవ్వకాలు మాత్రం ఆపడం లేదు. గత రెండు రోజులుగా కొండ వద్ద తవ్వకాలు జరిపి లారీలపై గ్రావెల్‌ను తరలిస్తున్నారు. బొబ్బిల్లంకకు చెందిన ఒక వ్యక్తికి సంబంధించిన లారీలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లారీలపై గ్రావెల్‌ను తరలించి అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. కాటవరానికి చెందిన చిట్టూరి వీర్రాజు విలేకరులతో మాట్లాడుతూ కాటవరం కొండపై గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు నడుస్తోందని, కాటవరం కొండ తవ్వకాలకు ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఇక్కడ జరుగుతున్న తవ్వకాలు అనధికారికంగా జరుగుతున్నాయని, గనులశాఖ ఏడీకి తెలిపితే.. తహసీల్దార్‌కు చెప్పాలంటున్నారని, తహసీల్దార్‌కు చెబితే గనులశాఖ ఏడీకి తెలపాలంటున్నారని అన్నారు. కొండ వద్ద తవ్వకాలు మాత్రం అధికారులు ఆపడానికి ప్రయత్నించడం లేదని ఆగ్రహం వ్యక్త చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల అండదండలతో కొండను తవ్వేస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా బొబ్బిల్లంక, ములకల్లంక గోదావరి పాయపై రోడ్డు వేయడానికి గ్రావెల్ కావాలని పంచాయతీరాజ్ డీఈ లెటర్ పెట్టారని, మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపాలని చెప్పానన్నారు. కొండను తవ్వుతున్నారని సమాచారం



రాత్రి సమయంలోనూ ఆగని ఎగుమతులు

లేదని, తక్షణమే వీఆర్వోను పంపి తవ్వకాలు నిలిపివేస్తానని అన్నారు.

ఆనందోత్సాహాలతో కార్తిక వనసమారాధన

పెదపూడి: కార్తిక వనసమారాధనల నిర్వహణతో సమాజంలో ఐక్యతాభావం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడలోని ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి సూర్యనారాయణరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా క్లబ్ వ్యవస్థాపకుడు ద్వారంపూడి దివాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దంపతులు, క్లబ్ సభ్యులు ఉసిరిచెట్టు వద్ద పూజలు చేశారు. నంది అవార్డు గ్రహీత, మెజీషియన్ సతీష్ మాయాజాలం, బద్రి, జ్యోతి సుస్వరాలతో ఉర్రూతలూగించిన కల్యాణి ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. లక్కీడిప్ విజేతకు మాజీ ఎమ్మెల్యే దంపతుల చేతులు మీదుగా బహుమతి అందజేశారు. ముందుగా ముఖ్య సలహాదారుడు మండ రాజారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, ఫ్యామిలీ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మ, సర్పంచి లంక మున్ని,



విజేతకు బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, సబ్బెళ్ల భీము, ద్వారంపూడి జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కార్తిక వనసమారాధన

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని వినాయకనగర్ కాలనీలో ఘనంగా కార్తిక వన సమారధన నిర్వహించారు. ఆదివారం కావడంలో చిన్న, పెద్ద తారతమ్యాలు లేకుండా అంతా కలిసి ఆటపాటలతో సరదాగా గడిపారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం సంహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యాసలపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరోచోట కొంకుదురు బుడిత మామిడి వద్ద చిన్నారులు కార్తిక వనసమారాధన నిర్వహించారు.

వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలు



బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో సత్కారాన్ని అందుకున్న జక్కంపూడి రాజా



పుష్కర వనంలో జరిగిన వన సమారాధనలో పాల్గొన్న మాజీ ఎంపీ భరత్‌రామ్

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- ఎయిర్‌పోర్టు రోడ్డులో వన సమారాధనల సందడి

మధురపూడి: వన సమారాధనలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం ఎయిర్‌పోర్టు సమీపంలోని తోటల్లో జరిగిన వనసమారాధనలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బూరుగుపూడి జంక్షన్ సమీపంలోని తోటలో జరిగిన లక్ష్మీ నరసింహ గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య నాయకుల ఆధ్వర్యంలో సమారాధనలో సంఘం నాయకులు కొత్తపల్లి భాస్కరరామ్, ఆర్. ప్రవీణ్‌కుమార్, మరంగంటి శ్రీను తదితరులు రాజాను శాలువా, పూలమాలలతో సత్కరించారు. బూరుగుపూడిలో జరిగిన శ్రీశ్రీ శివసాయి కాపు సంక్షేమ సంఘం నాయకులు కట్టా వీరసూరి, మేడిన దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన సమారాధనలో పాల్గొన్నారు. చందన రమేష్ గార్డెన్స్‌లో జరిగిన గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం సమారాధనలో రాజా పాల్గొన్నారు. ఈ వన సమారాధనల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో..

రాజానగరం: సమాజంలో కుల, మతాలకు అతీతంగా విభిన్న వక్తులు, కుటుంబాల మధ్య సమైక్యతను పెంపొందించేందుకు వన సమారాధనలు తోడ్పడుతుంటాయని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. లాలాచెరువు గోదావరి మహాపుష్కర వనంలో రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు, సీసీ చానల్ ఎండీ కొండలరావు, సినీనటుడు భద్రం హాజరయ్యారు. ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శ్రీరామ్మూర్తి, సారధి, శ్రీనివాస్, గణేష్, దుర్గారావు పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల్లో..

మండలంలోని చక్రద్వారబంధంలో కమ్మ సామాజిక వర్గం, రాజానగరంలోని ముత్యాలమ్మ వారి ఆలయం వద్ద కాపు సామాజిక వర్గం ఆధ్వర్యంలో వన సమారాధనలు జరిగాయి. దివాన్‌చెరువులోని డీవీబీ రాజు లేఅవుట్‌లో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), సినీదర్శకుడు దండు కార్తీక్‌వర్మ, రచయిత, దర్శకులు ఎం.కుమార్‌రాజు, సినీనటుడు సూర్యతేజ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన సత్యనారాయణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు.

అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘ వన సమారాధన

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 33వ కార్తిక వన సమారాధన మహోత్సవం ఆదివారం కోలమూరులోని శ్రీశ్రీశ్రీ సదానంద ఆశ్రమం ఎదురుగా ఉన్న సాయిరామ మందిరంలో సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. రుద్రహోమం, పూజాధికాలు, ఆటపాటలు, భోజనాలతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. సంఘ సభ్యులు రాచర్ల దుర్గాప్రసాద్, జొన్నలగడ్డ సత్య శ్రీనివాస్, బులుసు శ్రీరామచంద్రమూర్తి, బొడ్డపాటి సుబ్బలక్ష్మి, శ్రీనివాస్, ఏఎస్ఎన్ మూర్తి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థులు పద్యాలను అర్థం చేసుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థులు తెలుగు నీతి పద్యాలను అర్థం చేసుకోవాలని ఏపీ పేపరుమిల్లు విశ్రాంత ఇంజనీర్ పిచ్చుక వెంకటరాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం చదువు ప్రాముఖ్యత, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిచ్చుక వెంకటరాంబాబు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజనీర్ ప్రసాద్, విశ్రాంత స్కూల్స్ సూపర్‌వైజర్ వెంకటసత్యనారాయణ, పవర్ ఎయిడెడ్ స్కూల్ టీచర్ జి.రాజు మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణ అలవాటు చేసుకుని మెలగాలని అన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ చాగంటి వెంకట లక్ష్మీనరసింహారావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల వినియోగంతో జ్ఞానాభివృద్ధి



పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు



కొంకుదురు శాఖా గ్రంథాలయంలో ప్రముఖుల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

రంగంపేట: మనోవికాసానికి గ్రంథాలయాలు దోహదపడతాయని క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ విజ్ఞాన సమాజ నిర్మాణానికి యువత నాంది పలకాలన్నారు. విద్యార్థులు నీతి కథలు చదవడం వల్ల నైతిక విలువలు అలవడతాయన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు

బిక్కవోలు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొంకుదురు గ్రంథాలయ శాఖ వద్ద గ్రంథాలయోద్యమ ప్రముఖులకు నివాళులు అర్పించారు. కొంకుదురు గ్రామంలో జన్మించిన గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయాల పంచ సూత్రాలు రూప శిల్పి రంగనాథన్, గాంధేయవాది పాతూరి నాగభూషణంల చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

రజక సంఘాల ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

సీతానగరం: నియోజకవర్గంలో మూడు మండలాలకు సంబంధించి రజక సంఘాలను ఆదివారం ఎన్నికున్నారు. బొబ్బిల్లంక దోసపల్లి శ్రీనివాస్ స్వగృహంలో రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు మాత సీతారాముడు సమక్షంలో రజక సంఘాల కమిటీలను ఎన్నుకున్నారు. సీతానగరం మండలం రజక సంఘం అధ్యక్షుడిగా దోసపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వేల్పూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా వి.దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా బుడంపర్తి సత్యనారాయణ ఎంపికయ్యారు. కోరుకొండ మండలం సంఘం అధ్యక్షులుగా పెనుగొండ రాంబాబు, గౌరవ అధ్యక్షులుగా పెనుగొండ వెంకటరత్నం ఎన్నికయ్యారు. రాజానగరం మండల సంఘం అధ్యక్షుడిగా గంగరాజు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉచ్చిలి రామచంద్రరావు, చింతపల్లి రమణ, దోసపల్లి దుర్గారావు, శివకుమార్, కమిడి సుబ్రహ్మణ్యం, పాతరగడ్డ దిలీప్, సురేష్ పాల్గొన్నారు